క్లుప్తంగా

రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

కాటారం: మండలంలోని పత్తి పంట సాగు చేస్తున్న రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని బొప్పారం, పోతుల్వాయి, ఒడిపిలవంచ, ఆదివారంపేట, గోపాలపూర్ గ్రామాల్లో అవగాహన కల్పించారు. పత్తి విక్రయించే రైతులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని ఏఓ పూర్ణిమ పేర్కొన్నారు. యాప్‌పై ఈ నెల 24 వరకు గ్రామాల్లో రైతులకు క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఏఓ తెలిపారు.

ఇంటింటికీ బాకీకార్డుల పంపిణీ



బాకీకార్డులు అందజేస్తున్న నాయకులు

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్ (వి)లో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అచ్చె లచ్చన్న, మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ప్రజలను తప్పుదోవ పట్టించి అధికారం చేజిక్కించుకుందని మండిపడ్డారు. కావున ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలుపర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, బండెల నరేష్, ఆది రఘు, ఆకునూరి తిరుపతి, పోతనవేని ఐలయ్య, లడె నవీన్, అచ్చె కుమారస్వామి, ఎండీ అక్రం తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

మల్హర్: భూ సమస్యల పరిష్కారానికి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని తహసీల్దార్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్ భూ సమస్యలకు సంబంధించిన పత్రాలతో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌ను నేరుగా కలిసి సమస్యలను విన్నవించుకోవచ్చని చెప్పారు. రికార్డుల పరిశీలన అనంతరం అర్హులైన రైతులకు పట్టాలివ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. భూ సమస్యలు, ధ్రువీకరణ తదితర పత్రాల పనికోసం డబ్బులు ఎవరికి ఇవ్వొద్దని, ఎవరైన డబ్బులు డిమాండ్ చేసినట్లు తమ దృష్టికి తీసకవస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భావుసింగ్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భావుసింగ్‌పల్లి శివారు చెంచుకాలనీకి చెందిన జల్లే రమేశ్(41) మద్యానికి బానిసై నిత్యం భార్యతో పాటు పిల్లలతో గొడవ పడుతుండేవాడు. గురువారం ఉదయం భార్యతో మళ్లీ గొడవ పడి బయటకు వెళ్లి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఎందుకు తాగవని మందలించినందుకు ఆమెతో గొడవ పడ్డారు. భార్య బయట పని చేస్తుండగా రమేశ్ పురుగుల మందు తాగాడు. ఆమె ఇట్లోకి వచ్చే సరికి నోటి నుంచి నూరగలు వస్తు కిందపడి ఉండడంతో గమనించిన ఆమె చిట్యాల స్థానిక సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతిడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాజబాపు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో 200 పశువులకు, చంద్రుపల్లి గ్రామంలో 230 పశువులకు శుక్రవారం గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి వ్యాప్తిని నివారించడానికి ప్రతీ రైతు సహకరించాలని వైద్యాధికారి డాక్టర్ రాజబాపు సూచించారు. ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది లక్ష్మణ్, ముదస్సిర్, తిరుపతి, సంతోష్ వాక్సినేషన్‌లో పాల్గొన్నారు.

ఎర్రబారిన పత్తి



ఎర్రబడిన పత్తి పంట

- ఎర్ర తెగులుతో దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో రైతన్నలు

రేగొండ: పత్తి రైతుపై వాతావరణం పగబట్టింది. ఎన్నడూ లేనిది వానాకాలానికి నెల రోజుల ముందే వరణుడు పలకరించడం. పంట వేసిన తర్వాత ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో పత్తి పంటకు తెగుళ్ల బెడద తీవ్రమైంది. గతేడాది సరైన వర్షాలు లేక ఇబ్బందులు పడ్డ రైతులు ఈసారైనా గట్టెక్కుతాము అనుకుంటే ఈ ఏడాది గడ్డు పరిస్థితి ఎదురైంది. వాతావరణ మార్పుల ప్రభావం, అధిక వర్షాల ప్రభావంతో పత్తి పంట రైతు కళ్లెదుటే ఎర్రబారిపోతోంది. మందులు పిచికారీ చేసిన పంటలను కాపాడులేకున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15వేల ఎకరాల్లో సాగు..

రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలో దాదాపు 15 వేల ఎకరాలలో పత్తి సాగు చేయగా.. 30 నుంచి 40 శాతం వరకు ఎర్రతెగుళ్ల ప్రభావం పడింది. పత్తి పంట చేతికొచ్చే సమయంలో ఎర్ర తెగులు ఆశించి పంటంతా పాడైపోయింది. కాయతొలుచు పురుగులు కాయలన్నింటినీ పాడు చేయడంతో కాయలో కుళ్లు తప్ప పత్తి కనిపించకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆశించిన స్థాయి కంటే అధికంగా పత్తి పండుతుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. మెగ్నీషియం లోపం అని చెబుతున్నా అందుకు తగ్గట్టు మందులు కొడుతున్నా పంటలను కాపాడులేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి సర్వే చేపట్టలేదు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంటంతా దెబ్బతింది..



ఎకరం పొలంలో పత్తి పంటను సాగు చేశా. ఎన్ని మందులు కొట్టినా.. అడుగు మందులు పెట్టినా పంట కుదుట పడటం లేదు. నాలాంటి చాలా మంది రైతుల పొలాల్లో ఎర్రతెగులు సోకి పంటంతా పూర్తిగా దెబ్బతింది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

– అప్పని కట్టస్వామి, రైతు, కొత్తపల్లిగరి

కోటగుళ్లకు కాకతీయుల నాటి వైభవం తెస్తాం..



గణపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



రేగొండ: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: కోటగుళ్లకు కాకతీయుల నాటి వైభవం తెస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రాష్ట్ర పురావస్తు మ్యూజియంల శాఖ డైరెక్టర్ అర్జున్‌రావు లతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కోటగుళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల సముదాయం పునరుద్ధరించి పూర్వ వైభవాన్ని తెచ్చి భావితరాలకు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఈ గుడిల అభివృద్ధికి రూ.55 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామన్నారు. ఇంకా రూ.25 కోట్లు అవసరం ఉన్నాయని డీపీఆర్ తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. నియోజకవర్గంలోని పాండవుల గుట్టలు, కోడవటంచ, బుగులోని వెంకటేశ్వర స్వామి క్షేత్రాలు, మైలారం గుట్టలకు నిధులు మంజూరు చేయించనున్నట్లు పేర్కొన్నారు. పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్‌రావు మాట్లాడుతూ ఎమ్మెల్యే సూచనల మేరకు నియోజకవర్గంలో అన్ని దేవాలయాల అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌నాయక్,నాగరాజు అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

రేగొండ: మండలంలోని రంగయ్యపల్లి గ్రామంలో రూ.10 లక్షల నిధులతో పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు సంపత్‌రావు, పున్నం రవి, బొజ్జం రవి, వీరబ్రహ్మం, ప్రసంగితో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌లో భాగస్వాములు కావాలి

- సీడబ్ల్యూసీ గోదావరి సర్కిల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న అధికారులు

టేకుమట్ల: స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీడబ్ల్యూసీ గోదావరి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని అంకుషాపూర్‌లో స్వచ్ఛ భారత్ కార్యక్మమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో, గ్రామ శివారులో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 నుంచి స్వచ్ఛ భారత్ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సబ్ డివిజన్ ఇంజనీర్‌చైతన్య జూనియర్ ఇంజనీర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి



మల్హర్: సమావేశంలో మాట్లాడుతున్న సమ్మయ్య

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో నేడు (శనివారం) నిర్వహించే బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను సాధించేత వరకు బీసీ పోరాటం ఆగదన్నారు.

మల్హర్: 42 శాతం బీసీ రిజ్వర్వేషన్ అమలుకు తెలంగాణ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జ్ విజయగిరి సమ్మయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కొయ్యూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిని విలేకరుల సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఎస్సీ, ఎస్టీ బీసీ కుల సంఘాలు బంద్‌కు మద్దతు ప్రకటించినందుకు బీసీ జేఏసీ తరఫున సమ్మయ్య ధన్యవాదాలు తెలిపారు. మండల బీసీ జేఏసీ నాయకులు భాద్రపు సమ్మయ్య, యాదండ్ల గట్టయ్య, జంగిడి సమ్మయ్య, సిద్ధి లింగమూర్తి, మెట్టు రామన్న, అక్కినేని సుమన్, మాంతయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు

పలిమెల: బీసీలకు రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ అధ్వర్యంలో పిలుపు ఇచ్చిన బీసీల బంద్‌కు బీఆర్‌ఎస్ పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ఉంటుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలు అమలుకాని హామీలతో బీసీలను అడుగడుగునా వంచించి మోసం చేసిందని, ఎట్టి పరిస్థితుల్లోనైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాళేశ్వరం: బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నేడు (శనివారం) సంపూర్ణ బంద్ పాటించి, స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేయాలని బీసీ ఐక్య వేదిక కాటారం డివిజన్ నాయకుడు సముద్రాల తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ బంద్ బీసీలో పాల్గొని ఐక్యతను చాటి చెప్పాలన్నారు. అలాగే, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు అలీంఖాన్‌లు బీసీ బంద్‌ను పాటించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

జల్సాలకు అలవాటుపడి కేబుల్ చోరీ



వివరాలు తెలుపుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

కాళేశ్వరం: జల్సాలకు అలవాటు పడి ముగ్గురు యువకులు కేబుల్ వైర్ చోరీ చేసి పోలీసులకు దొరికిన సంఘటన మహదేవపూర్ మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం మహదేవపూర్ పోలీసుస్టేషన్‌లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ వివరాలను వెల్లడించారు. మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజ్ వద్ద కరెంట్ స్తంభాలకు ఉన్న కాపర్ కేబుల్ వైర్ దొంగతనం జరిగిందని ఈ ఏడాది జనవరి నెలలో బ్యారేజ్ జూనియర్ ఇంజనీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ కేసు నమోదు చేయగా, సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దర్యాప్తు వేగం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ ప్రాంతంలో ఎస్సై తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా, ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతూ పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకొని విచారించారు. అంబట్‌పల్లి గ్రామానికి చెందిన వడ్ల వినోద్ కుమార్, నల్ల సతీష్, గుజ్జుల మహేష్‌లుగా గుర్తించారు. ఆ ముగ్గురు స్నేహితులు దొంగతనాలు చేసి ఆ డబ్బుతో జల్సాలు చేసుకుందామన్నారు. జనవరిలోనే రాత్రి సమయంలో మేడిగడ్డ బ్యారేజ్‌కి కుడి వైపున గల స్తంభాలకు ఉన్న సుమారు 180 మీటర్ల కాపర్ కేబుల్ వైరును, ఆగస్టు నెలలో 120 మీటర్ల కాపర్ కేబుల్ వైర్‌ను దొంగిలించారు. దానిని గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించగా వచ్చిన డబ్బులు అందరు పంచుకున్నారు. మళ్లీ కాపర్ వైర్ దొంగతనం చేసేందుకు శుక్రవారం వెళ్తుండగా పోలీసుకు చిక్కారు. వారి పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. దొంగతనానికి ఉపయోగించే ఒక హ్యాక్సా బ్లేడ్, ఒక కటింగ్ ప్లేయర్, కాపర్ వైర్ 120 కేజీలు, రూ.1.30లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవటంలో సాంకేతిక ఆధారాలు, సీసీ కెమెరాలు, వెహికల్స్ చెకింగ్, టెక్నికల్ డాటా, ద్వారా చేధించినట్లు పేర్కొన్నారు. ఈ కేసును అతి తక్కువ కాలంలో చేధించిన మహదేవపూర్ పోలీసులను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న పూనెం శ్రీనివాస్

ఏటూరునాగారం: లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ పూనెం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బక శ్రావణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పూనెం శ్రీనివాస్ మాట్లాడుతూ.. లంబాడీలను తొలగించడానికి అవకాశాలు ఉన్నాయని, లంబాడీల తొలగింపు ధ్యేయంగా అందరు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. లంబాడీలను తొలగించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 3న ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలని అన్నారు. ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొర్స నర్సింహమూర్తి, గొప్ప వీరయ్య, పూనమ్ రామచందర్, మడి సాయి బాబా, కల్తి కుమారస్వామి ఉన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నం సరికాదు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి యత్నించడం సరికాదని ఎమ్మార్పీస్ నాయకులు అన్నారు. జస్టిస్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలు చేపట్టి తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దాడికి యత్నించిన రాకేశ్ కిషోర్‌పైన దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సాక్షి నెట్‌వర్క్



మహదేవపూర్‌లో తహసీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



టేకుమట్లలో..



కాళేశ్వరం: నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మల్హర్‌లో..

బీసీ జాక్ జిల్లా కో కన్వీనర్‌గా కత్తి సంపత్



టేకుమట్ల: బీసీ జాక్ జిల్లా కో కన్వీనర్‌గా కత్తి సంపత్‌ను నియమించినట్లు బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పైడిపల్లి రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కత్తి సంపత్ మాట్లాడుతూ.. 60శాతం ఉన్న బీసీలను నిత్యం అగ్రవర్ణాలకు చెందిన వారు అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్‌లు అమలయ్యే వరకు బీసీ సంఘాల తరపున పోరాటాలు చేస్తామని అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం కేబినేట్ సమావేశంలో తీసుకొన్న కీలక నిర్ణయంపై ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికలలో పోటీ చేయరాదనే జీఓను రద్దు చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మండల నాయకుల సిరిపురం కుమారస్వామి, దొడ్డి కిష్టయ్య, గడ్డం కోరయ్య, సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతా శిశు సంరక్షణ వైద్యాధికారిని యోషిత అన్నారు. మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను, గర్భిణులను పరీక్షించి మందులను ఇవ్వడంతో పాటు పలు ఆరోగ్య సూత్రాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలానుగుణంగా కొన్ని వ్యాధులు వస్తాయని అవి రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ చేస్తున్న హరిప్రసాద్

టేకుమట్ల: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని గుండెపోటు వచ్చిన సమయంలో వ్యక్తికి సీపీఆర్ చేస్తే ప్రాణాన్ని కాపాడవచ్చునని 108 ఈఎంటీ బొమ్మ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జీవీకే, ఈఎంఆర్ఐ 108 అంబులెన్స్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుండెపోటు వచ్చిన సమయంలో వ్యక్తికి సీపీఆర్ ఎలా చేయాలో చేసి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీపీఆర్ అనేది ఒక ప్రాణ రక్షణ పద్ధతి అన్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగినప్పుడు, గుండె కొట్టుకోవడం నిలిచిపోయినప్పుడు మెదడుతో పాటు శరీరంలోని ముఖ్య అవయవాలకు రక్తం, ఆక్సిజన్ అందక వ్యక్తి మృతి చెందే ప్రమాదం ఉందన్నారు. ఆ సమయంలో సీపీఆర్ చేయడం వల్ల మెదడుతో పాటు శరీరంలోని ముఖ్య అవయవాలకు రక్తం, ఆక్సిజన్ అంది వ్యక్తిని ప్రాణాపాయం నుంచి రక్షించబడతాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ జిల్లా మేనేజర్ రాజునాయక్, పైలట్ రవీందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది బాలయ్య, సంజీవ్, అశోక్, గ్రామస్తులు నాగరాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ వేణుగోపాలా చారి



రైతులతో మాట్లాడుతున్న వేణుగోపాలా చారి

రేగొండ: జిల్లాలో పేరుకుపోయిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ వేణుగోపాలా చారి విద్యుత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ పంపిణీలో ఎదురయ్యే లోపాలను సత్వరమే పరిష్కరించడానికి వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరిచడంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వినియోగదారుల ఫోరం దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చదువుతోనే పేదరిక నిర్మూలన

- డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రేణుక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రేణుక

ఏటూరునాగారం: చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ప్రిన్సిపాల్ రేణుక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో అతర్జాతీయ పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలను చదివించి ఉద్యోగం, ఉపాధి వైపు వెళ్లే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్, నవీన్, వెంకటయ్య, జ్యోతి, ఫాతిమా, సంపత్, జీవవేణి, రమేష్, రాజశేఖర్, శ్రీధర్, భావన, భారతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎస్‌ఎస్‌తాడ్వాయి: పాఠశాలలను పరిశుభ్రతగా ఉంచాల్సిన బాధ్యత స్కావెంజర్లపై ఉందని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ గడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ పాఠశాలలో మండలంలోని పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించడంలో స్కావెంజర్ల పాత్ర కీలకమన్నారు. పాఠశాలల పరిశుభ్రత, మొక్కలు పెంపకం, మరుగుదొడ్లు, మూత్రశాలల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇందిరాగనర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రేణుక, రవికుమార్ ఉన్నారు.